క్లుప్తంగా

‘అమరులను స్మరించుకుందాం’


నివాళులర్పిస్తున్న ప్రతిభ

కెరమెరి/నార్నూర్: ఇంద్రవెల్లి ఘనటలో వీర మరణం పొందిన వీరులను స్మరించుకుందామని జైనూర్ మండలం మార్లవాయి సర్పంచ్ కనకప్రతిభ అన్నారు. గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో వీరులకు నివాళులర్పించారు. వారి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సావిత్రి, గ్రామ పెద్దలు లింగు, భీంరావు, ఆనంద్‌రావు, గణపతి, నందు, నితీష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె


దహెగాం: వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

దహెగాం: తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా టీజీబీ మేనేజర్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వీవోఏలు రాజు, సకారాం, మల్లేష్, సంగీత, తుకారాం, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నిరసన..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో ఐకేపీ వీవోఏల సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట వీవోఏలు వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.

రేపు వృత్తి విద్యాకోర్సుల సర్టిఫికెట్ల పంపిణీ

రెబ్బెన: బెల్లంపల్లి సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వృత్తి విద్య కోర్సులకు సంబంధించిన సర్టిఫికెట్లను శనివారం జీఎం కార్యాలయంలో అందజేయనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటీషియన్ ఉచిత శిక్షణ కోర్సులను పూర్తి చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కోర్సు పూర్తి చేసుకుని పరీక్షలకు హాజరైన 93 మంది మహిళలకు ఏరియా సేవా అధ్యక్షురాలు స్వరూపారాణి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

పరామర్శ

నార్నూర్: మండల కేంద్రంలోని మైనార్టీ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు సలీంను గురువారం సిర్పూర్ (యూ) మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆత్రం అనిల్ పరామర్శించారు. ఇటీవల అతడు గుండెపోటుకు గురికావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నార్నూర్: మండలంలోని ఎంపల్లి అంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్రతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివచ్చారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : విరూపాక్ష

కాగజ్‌నగర్
వెంకటరమణ : విరూపాక్ష

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	50
చామగడ్డ	60
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్


పెంచికల్‌పేట్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంట

గాలివాన బీభత్సం

దహెగాం, పెంచికల్‌పేట్ మండల కేంద్రాలతో పాటు మండలాల్లోని ఆయా గ్రామాల్లో బుధవారం గాలివాన బీభత్సం సృష్టించింది. దహెగాం మండలంలోని బీబ్రా గ్రామంలో నూతనంగా నిర్మించిన వ్యాపార సముదాయం షెడ్ల రేకులు గాలికి ఎగిరిపోయాయి. గాలులకు మామిడికాయలు రాలిపోవడంతో రైతులు వాపోతున్నారు. వరి కోత దశకు రాగా గాలి, వర్షానికి పంట నేల కొరిగింది. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెంచికల్‌పేట్ మండలంలో సుడిగాలులతో కూడిన భారీ వర్షం పడడంతో వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తీవ్ర నష్టం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొండపల్లి, పోతెపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి.

– దహెగాం/పెంచికల్‌పేట్


కొండపల్లిలో లేచిపోయిన ఇంటి పైకప్పు


దహెగాం: గాలికి ఎగిరిపోయిన రేకులు

వేసవి దుక్కులతో ప్రయోజనం

- పంటల దిగుబడి పెరిగే అవకాశం
- చీడపీడలను నివారించవచ్చు


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు వానాకాలం సీజన్ కోసం ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వేసవిలో రైతులు చేసే పనులతోనే పంటల దిగుబడి ఆధారపడి ఉంటుందని, వేసవి దుక్కులతో ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. వేసవిలో చేపట్టాల్సిన పనులపై అధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

లోతుగా దున్నాలి..

దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న పొలాల్లో ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దుక్కులు దున్నాలి. సుమారు 9 అంగుళాలకు తగ్గకుండా దుక్కులు దున్నుకోవాల్సి ఉంటుంది. లోతు దుక్కులు దున్నినప్పుడు నేల పైపొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను ఆశించే పురుగులు చనిపోతాయి. నేలలో దాక్కునే క్రిమికీటకాలు ఎండల బారిన పడి నశిస్తాయి. లోతు దుక్కులు చేసుకుంటే తొలకరిలో విత్తనాలు విత్తుకునే పంటలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

పశువుల మందతో లాభాలు..

గతంలో ఎడ్లు, ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలను రాత్రిళ్లు పొలంలో మందలు పెట్టేవారు. పశువుల మలమూత్రాలు సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఎన్నో లాభాలు చేకూర్చుతాయి. దీంతో రైతులకు ఎరువు ఖర్చు చాలా తక్కువగా ఉండేది. ప్రస్తుతం పశువులు తగ్గిపోవడంతో పంటలకు సేంద్రియ ఎరువు వాడకం తగ్గిపోతోంది. రైతులు వేసవిలో పంట చేలు, పొలాల్లో గొర్రెల, బర్రెల మందను వారం, పది రోజుల పాటు ఏర్పాటు చేసుకుంటే భూమికి సేంద్రియ ఎరువు లభిస్తుంది. దీంతో ఎరువు ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా అధికంగా ఉంటుంది.

కలుపు నివారణ..

వేసవి దుక్కులతో పంట పొలాల్లో కలుపు నివారించుకోవచ్చు. పొలంలో ఎక్కువగా తుంగ, గరిక, ఒలిపిడి వంటి కలుపు మొక్కలతో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. వేసవి దుక్కులు దున్నుకోవడంతో కలుపు మొక్కల వేర్లు, కాయలు వంటివి బయటకు వచ్చి ఎండిపోతాయి. ఎండిపోయిన వాటిని ఏరివేస్తే మంచి ఫలితం ఉంటుంది. కాగా మండలంలో 12వేల మంది రైతులు 56వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో ఎక్కువగా పత్తి పంట సాగు చేస్తున్నారు. ఇప్పటికే పత్తి సాగు చేసిన భూముల్లో రైతులు ట్రాక్టర్లతో దుక్కులు దున్నుకున్నారు.

అవగాహన కల్పించాలి

వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలి. గ్రామసభలు నిర్వహించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు అందించాలి. అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు.

- బాపు, రైతు

లోతుగా దున్నాలి

వేసవి దుక్కులతో వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. రైతులు లోతుగా దుక్కులు దున్నుకోవాలి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. పశువుల మందలు పెట్టుకుంటే పంటకు సేంద్రియ ఎరువు లభిస్తుంది.

- ఖాదర్ హుస్సేన్, ఏవో

అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతాం

పెంచికల్‌పేట్: గ్రామాల్లోని వయోజన నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే విజ్ఞాన్ సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ లక్ష్యమని సంస్థ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో గంగాసింగ్‌తో కలిసి వయోజన నిరక్షరాస్యులకు పలకలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో అక్షర జ్ఞానం కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్లూర్ సర్పంచ్ దుర్గం రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, వలంటీర్లు కిరణ్, ఈశ్వర్, శ్యామల, సంతోష్, రమేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పలకలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో గంగాసింగ్, సొసైటీ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

కౌటాల: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. విజ్ఞాన్ సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత పలకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చదువుకోవాలనే ఉద్దేశంతో విజ్ఞాన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన్ ఉచిత అక్షరజ్ఞాన సెంటర్‌ను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరక్షరాస్యతను పారదోలడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నసరుల్లాఖాన్, సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావ్, సంఘం సభ్యులు గణపతి, నాయకులు డబ్బా బాపు, సంతోష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ సొసైటీ సేవలు అభినందనీయం

చింతలమానెపల్లి: అక్షరాస్యతను అభివృద్ధి చేసే విజ్ఞాన్ సొసైటీ సేవలు అభినందనీయమని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో విజ్ఞాన్ ఉచిత జ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి తమ సంతకం చేసే అక్షరజ్ఞానం తప్పనిసరన్నారు. విజ్ఞాన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు చేస్తున్న సేవలు అమూల్యమైనవని వారికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. విజ్ఞాన్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర రావు, మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ భీంకరి నారాయణ, సొసైటీ జిల్లా సిబ్బంది గణపతి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, నిరక్షరాస్యతను నిర్మూలించడమే తమ లక్ష్యమని ఎంపీడీవో మాధవి అన్నారు. మండల కేంద్రంలో విజ్ఞాన్ సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షర జ్ఞాన కేంద్రాన్ని సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరరావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మనిషి మనుగడకు చదువు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతీఒక్కరు అక్షరాస్యులుగా మారాలని కోరారు. అనంతరం ప్రజలకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్ రెడ్డి, విజ్ఞాన్ జిల్లా సిబ్బంది గణపతి, గ్రామ విజ్ఞాన్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


పలకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నానయ్య


పలకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్


బెజ్జూర్: పలకలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

పెండింగ్ వేతనాలు ఇప్పించాలి

రెబ్బెన: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం గోలేటి ఉపాధికూలీలు డీఆర్‌డీవో సురేందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ 2022 -23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గోలేటిలో నిర్వహించిన పనులకు హాజరైన కూలీలకు ఏడు వారాల కూలీ డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. పనులు చేయని కూలీలకు వేతనాలు చెల్లించి వాస్తవంగా పనిచేసిన కూలీలకు నేటికీ వేతనాలు చెల్లించడం లేదన్నారు. గత ఏడాదికి సంబంధించిన పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయని అర్హులైన వారికి న్యాయం చేసేందుకు విజిలెన్స్ కమిటీ నియమించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పనులకు వెళ్లకుండా వేతనాలు పొందిన వారిని గుర్తించి తిరిగి డబ్బులు రికవరీ చేస్తామని డీఆర్‌డీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో బుచ్చన్న, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జలేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ తుకారం, ఉపాధి కూలీలు కడతల సాయి, జరుపుల తిరుపతి, లక్ష్మి నారాయణ, విజయ, తిరుపతి తదితరులు ఉన్నారు.

మురళీగూడలో వైద్య శిబిరం

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో గురవారం పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గత పది రోజులుగా గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతుండడంతో జ్వరాల నివారణకు వైద్య శిబిరాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 51 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా ఆరుగురికి జ్వరమున్నట్లు నిర్ధారించారు. మరో 26 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. గ్రామస్తులు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ ఈశ్వరీ బాయి, ఉపసర్పంచ్ ప్రభాకర్, హెచ్‌ఏ ధర్మారావ్, ఏఎన్‌ఎం లక్ష్మి, ఎల్‌టీ నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ మాధవి తదితరులు ఉన్నారు.


వివరాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ అమన్

కోతకు గురైన రోడ్డుతో ప్రమాదాలు


అనుకోడ వద్ద కోతకు గురైన రహదారి

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలోని ప్రధాన రహదారి కోతకు గురికావడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. ఈరోడ్డు కౌటాల నుంచి రవీంద్రనగర్, చింతలమానెపల్లి మీదుగా బెజ్జూర్‌కు వెళ్లే మార్గం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. బాలాజీఅనుకోడ గ్రామంలోని మూలమలుపు వద్ద రోడ్డు కోతకు గురైంది. దీంతో అక్కడ తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పలువురు తీవ్ర గాయాలపాలైన సంఘటనలు సైతం ఉన్నాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఖాతాదారులు బీమా చేసుకోవాలి

కౌటాల: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా చేసుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ నరసింహస్వామి అన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గుండాయిపేట్‌లో ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జన సురక్ష పథకాలతో ప్రజలకు ఆర్థికంగా మేలు కలుగుతుందని తెలిపారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఖాతాదారులకు ఎలాంటి సందేహాలు ఉన్న బ్యాంకులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాప్లె లహంచు, బ్యాంకు అధికారులు రాజేశ్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, నాయకులు శంకర్, సంతోష్, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న మేనేజర్ నరసింహస్వామి

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌అర్బన్: భవన నిర్మాణ కార్మికులు పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కార్మికశాఖ సహాయ అధికారులు రాజలింగు, వినోద్ అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు, ప్లంబర్లకు 15 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగింది. శిక్షణ గురువారంతో ముగిసింది. శిక్షణ కాలంలో ఒక్కొక్కరికి రోజుకు రూ.300 చొప్పున పదిహేను రోజులకు రూ.4500 ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో న్యాక్ శిక్షకుడు ద్యావంత్ రమేశ్, దీపక్, కార్మికులు, ప్లంబర్లు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

నేరడిగొండ: మన ఊరు.. మన బడి పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. గురువారం మండలంలోని బుగ్గారం(బి), వడూర్ గ్రామాలతో పాటు నేరడిగొండ మండల కేంద్రంలోని పాఠశాలలను సందర్శించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం లేని పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. డిప్యూటీ ఇంజనీర్ సునీల్, సీఆర్పీ సురేందర్, ప్రధానోపాధ్యాయులు, గుత్తేదారు కృష్ణ, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

భగీరథ నీటి కోసం నిరసన

సిరికొండ: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీటి కోసం ఎస్టీ కాలనీవాసులు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. భగీరథ నీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పందించిన సర్పంచ్ నర్మద కాలనీవాసులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం సాయంత్రం రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, బీఎస్పీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగీర్ అహ్మద్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్, జమియత్ ఉలేమా ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా ముబీన్, మాజీ కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.


ఇఫ్తార్‌లో పాల్గొన్న అర్షద్ హుస్సేన్